# నమ్మకం

"యింటి ముందర షామియానా యేసుండేది గూడా కన్పడలేదా నీకు? యింకా యేడికి పోతావుండావు? హోల్డాన్ హోల్డాన్ . . . ." అంటూ ఆటోడ్రైవరు భుజంపైన చేయివేసి గట్టిగా నొక్కుతూ పొలికేక పెట్టాడు గంగయ్య.

యెండను జల్లెడపడుతున్న రంగుగుడ్డల షామియానా కింద, నీడను కొలిచి దాని కేంద్రమేదో కనిపెట్టినట్టున్న చోట, మండి బూడిదైపోతున్న కట్టె పేళ్లలోంచీ, తెల్లటి పొగ నిస్సారంగా వెలువడుతోంది. దానికి బారెడు దూరంలో యింటి గడపముందు మనుషుల పాదాలకింద పడి నలిగిన పూలమాలొకటి అస్తవ్యస్తంగా పడివుంది. యింటి లోపలి నుంచీ రెండుమూడు బొంగురు గొంతుకలు తోచీ తోచనట్టుగా రాగాలు తీస్తున్నాయి. షామియానా నీడపైన అలిగి పక్క కెళ్ళిపోయినట్టుగా, వీధి కటు చివరలో, నలుగురు మనుషులు నేలపైన గొంతుకూర్చుని, మట్టిలో గీసిన గీతలపైన నక్కాముట్టి ఆడుకుంటున్నారు.

"నీ మాదిరి పార్టీ దినానికొకటి దొరికితేసాలు నా ప్రాణం తీసే దానికి . . . దగ్గిర దగ్గిర్నే అని చెప్పి వూరంతా తిప్పించినావు. బిన్నాగా దిగతావా లేకపోతే ఆ సామాన్లతో గూడా నిన్ను గూడా యెత్తి కిందికి దిగ్గొలకమంటావా?" అంటూ ఆటో డ్రైవరు హుంకరించాడు.

ఆటో శబ్దంవిని యింటిలోపలి నుంచీ బయటికొచ్చిన వ్యక్తి "యెప్పుడనంగా పోయినోడివి! యిప్పుడా తిరుక్కోనివస్తా వుండావు? యింతసేపు యేడ అరుట్లు గొట్టినావు?" అని అడిగాడు కోపంగా.

అతడికేసి విస్తు పోయి చూశాక, బలవంతంగా పెదవులు సాగదీసి "యిహీహీ .." అని యెబ్బెట్టుగా నవ్వేశాడు గంగయ్య. యింకా నేలపైనే కూచుని ఆడుకుంటున్న వ్యక్తులకేసి తిరిగి "వొరేయ్! గోయిందూ! రత్నం! నర్సింమం! సిన్నాబ్బా! బిన్నాగా వచ్చి సామాన్లు కిందికి దించండిరా!" అని పిలిచాడు. గుంపుగా కూచ్చుని ఆడుకుంటున్న వాళ్ళెవరూ తలతిప్పలేదు.

యింటిలోంచీ వచ్చిన వ్యక్తి కోపంతో చివాలున వంగి, నేలపైన రగులుతున్న చెక్కపేడును చేతికెత్తుకుని 'లేచివస్తారా! లేకపోతే కొరివితో రెండు జాడించమంటారా? వచ్చింది దేనికిరా మీరు? తాగేసి తందనాలాడే దానికా? లేకపోతే కార్యం జరిపించేదానికా?' అని గాండ్రిస్తూ ముందుకురికాడు.

నిప్పు తగలగానే మండుతూ చిందరవందరయ్యే టపాకాయల్లా గుంపులోని మనుషులందరూ లేచి దూరంగా పరిగెత్తారు.

"అన్న చూసేదానికి దరమరాజు మాదిరి గనబడతాడుగానీ కోపమొస్తే యిలావంతుడేరా!"అన్నాడొకడు దూరంగా పరిగెత్తాక పళ్ళన్నీ కనబడేలా పరవశంగా నవ్వుతూ.

"యీ వుపద్రం ముసిలోడు ఆలిస్యం జేసినాడుగానీ లేకపోతే యీ యరవకంతా పలకలు మోగతావునుండవా సా . . . " అంటూ మరొకతను ఆటో దగ్గరికి నడచాడు.

"మార్కెట్టుకు తోడుగా రమ్మని అడుక్కున్నాను సామీ! వొక్క గాడిద కొడుకూ రాలేదు. వొంటిచేత్తో పనులన్నీ ముగించుకోనొచ్చే సరికి యీ పేళయ్యింది." గంగయ్య గూడా నవ్వుతూనే పిర్యాదు చేశాడు.

"అన్ని పన్లకూ మామిందబడి యేడవకపోతే నీకు పొద్దు జరగదా? మీ చిన్నోడు రచ్చపైన యిస్పెట్టాకుల్లో గుచ్చోనుండేది నీ కంటికి అగుపడ్లేదా?" వెక్కిరిస్తున్నట్టుగా నవ్వుతూ యింకొకతను ప్రశ్నించాడు.

"మా చిన్నోడు యిట్లాంటి కార్యాలకు రాడని నీకు తెలవదారా ముత్యాల్ !" అంటూ గంగయ్య తన మీసాలు మెలివేస్తూ ముందుకో అడుగు యెగిరి దూకాడు. తరువాత యింటి గల్లాయనకేసి తిరిగి"వాడు కాలోజీలో చదివినోడు సామీ! యిట్లాంటి మట్టిపనులకు వాణ్ణి రానిస్తానా చెప్పు?" అని న్యాయం అడిగాడు

"కమీషన్లో మాగ్గూడా భాగం యియ్యాల్సొస్తాదని మార్కెట్టుకు మమ్మల్ని పిలవలేదు.. యిప్పుడు తప్పంతా మా మీదికి తోసేస్తావుండాడు. యీ మనిషిని నమ్మనే నమ్మద్దు .." గుంపులోంచీ వొక నడివయసు మనిషి అరిచాడు.

"మాది దొంగతనంగా కమీషన్లు దొబ్బుకునే వంశంగాదురా మాదర్చోద్! సామీ! యీ పోసుగోలు మాటలు చెవినేసుకోవద్దు. యీ చినబ్బగాడోళ్ళ తాత రండాకోరు. వీనబ్బ ముండాకోరు..." గంగయ్య కింది పెదవిని మునిపంట కొరుక్కుంటూ కోపాన్ని వెలిగక్కాడు.

ఆటోలోంచీ గంగయ్య అందిస్తున్న కుండను చేతికందుకోకుండా వెనక్కో అడుగేసి "నన్నేమైనా అను చిన్నాయినా! మా పెద్దోళ్ళనన్నావంటే గొమ్మునుండను" అని రవాటించాడు చిన్నబ్బ.

"యిద్దరూ గలిసి యింటి దాంకా తెచ్చిన కొత్తకుండను యీదిలోనే పగలగొట్టేసేటట్టుండారు. అంతపని గాని జరిగిందంటే మీ చెమడాతోలు వలిచేస్తాను..." అంటూ యింటి గల్లాయన గాలిలోకి చేయి విసురుతూ కొట్టబోయాడు.

ఠీవిగా ముందుకెళ్ళి కుండను రెండుచేతుల్లోకి తీసుకున్నాక "చావింటి ముందర కొత్త కుండ పగిలితే అశుభం గదన్నా! నా కట్టెలో పాణముండేంత దాంకా అట్లాంటి పని జరగనిస్తానా నేను?" అన్నాడు చిన్నబ్బ హుందాగా.

వొకతను ఆటోలోంచీ గుడ్డ సంచిని అందుకున్నాడు. యిద్దరు వ్యక్తులు గోతం మూటనూ, వెదురు కర్రలనూ కిందికి దించారు.

వాళ్ళ దగ్గరినుంచీ గాటుగా వస్తున్న వాసనను ఆబగా యెగ పీలుస్తూ "నాకు తెలవకుండా వీళ్ళకు అద్మాన్సిస్తే యిట్నే అయితింది సామీ! అందరూ అప్పుడే పూటుగా

గొంతులదాంకా పట్టించుకునేసినారు. యింక వీళ్ళను పట్టేదానికెవురివల్లయితింది?" అని యింటిగల్లాయనను నిలదీసాడు గంగయ్య.

"చేతుల్లో దుడ్డు పడేదాంకా నన్ను నిలవనిచ్చినారా వీళ్ళు? మీతో యేగేదానికి నా వల్లగాదు. రేయ్, ఆమూటా, కొయ్యలూ గోడపక్కన పెట్టుకోండి. యింట్లో పీనిగ లేచినప్పుడు మీకా యికయికలూ పకపకలూ యెట్లొస్తాయిరా?.." యింటి గల్లాయన మండిపడుతూ అందరితో వొకేసారిగా మాట్లాడడానికి ప్రయత్నించాడు.

ఆటోలోని సామాన్లన్నీ దించేశాక, గంగయ్య ఆటోడ్రైవరుకు డబ్బులిస్తూ మరోసారి అనవసరంగా సకిలించాడు.

"యిదేంది?" ఆటో అతను విరుచుకపడ్డాడు. "తమాసాగా వుండాదా? గంటసేపు వూరంతా తిప్పించి ముప్పయ్యిస్తావుండావు. యాభైకిపైసా తగ్గినా వొప్పుకోను."

"యిచ్చెయ్యిరా గంగా! వొప్పుకున్న బేరానికి కట్టుబడాల... మాట తప్పేది యిధాయికం గాదు..." గుంపులోంచీ ముసలతను దగ్గరికొచ్చాడు.

గంగయ్య అతణ్ణి మింగేసేలా చూస్తూ "నీ కొడుకుల వొయిసుండే వాళ్ళతో జేరుకోని పీకలదాంకా మందుగొట్టేసినావు. యిప్పుడు మద్దిస్తానికి నిన్నెవురు పిలిచినార్రా నర్సింహా!" అని రెట్టించాడు.

ఆటో డ్రైవరు యింటిగల్లాయనకేసి తిరిగి "పోతే పోనీ ముసిలోడు గదా అని, సావు సామాన్లని గూడా అనుకోకుండా యాభైకి వొప్పుకున్నాను. యిట్నే యింకొంచేపు నన్ను నిలబెడితే వెయిటింగు చార్జీ గూడా వసూలు జేసి తీరతాను" అన్నాడు కచ్చిగా.

యింటిలోపలినుంచీ నలిగిన దుస్తులతో వచ్చిన యువకుడు ముఖం చిట్లించుకుని "రాహుకాలం లోపల యెత్తేయ్యాల. యింకావీళ్ళు మొదులు పెట్టలేదా బాబాయ్!" అని ప్రశ్నించాడు.

"తుమ్మలగుంట మాలోళ్లతో పనంటే తుమ్మకంపల్లో చిగులుకున్నట్లేరా నాయినా అంటే వింటివా నువ్వు? వీళ్ళేమైనా పనిలోకి ముగస్తావుండారా చూడు. రేయ్ గంగా! నీ సొంత దుడ్డిస్తావుండే వాని మాదిరిగా గునస్తావేందిరా నువ్వు? ఆటోను అంపించేసి టిన్నాగా పన్లోకి దిగండి..." అంటూ యింటిగల్లాయిన రుసరుసలాడాడు.

"మీ దుడ్డయితే మాత్రం వూరికే వచ్చిందా సామీ ? సెలవు జేసేటప్పుడు దుడ్డెవురిదైనా కిందా పైనా చూసుకోని సెలవు జెయ్యాల." అన్నాడు గంగయ్య ముఖమంతా నవ్వుజేసుకుంటూ. చొక్కాజేబులోంచీ మరో అయిదు రూపాయలు తీశాక 'మొత్తం నలభై అయిదైంది. దీంతో సంతోసంగా యెలబారిపోన్నా!" అని ఆటో డ్రైవరును ప్రాధేయపడ్డాడు.

ఆటో డ్రైవరు వొప్పుకోనన్నట్టుగా చేయితిప్పాడు.

నలిగిన తెల్లరంగు గొడుగులా గున్న పాంటు జేబులోంచీ పదిరూపాయల కాగితాన్ని పైకితీసి ఆటో డ్రైవరు కిచ్చాక "నువ్వు బయిల్దేరు.. మాకు చానాపన్లుండాయి" అన్నాడా యువకుడు.

ఆటోడ్రైవరు వొకచేత్తో పదిరూపాయలందుకుని, మరో చేత్తో గంగయ్య చేతిలోని డబ్బుల్ని వూడబెరుక్కుని సరసరా ఆటోలోకి దూరేశాడు.

"యాభై అయిదు లాక్కునేసినావు... ఆ అయిదు నాదీ...నాకిచ్చెయ్యి" అని గొల్లుమని అరుస్తూ గంగయ్య ముందుకురికాడు. అందకుండా పరిగెడుతున్న ఆటోవైపుకు "నా అయిదు... నా అయిదు..." అని పరిగెత్తబోయి, కాలూ కాలూ కొట్టుకోవడంతో ముందుకు తూలిపడబోయాడు.

"రంపు జెయ్యకుండా పనిలోకి దిగండి" అని గొడుగుపాంటు యువకుడు కసిరాడు. "దుడ్డు కోసరం యిదైపోకుండా అన్నీ సక్రమంగా జరిపించు బాబాయ్! యేదైనా రిమార్కొస్తే వొప్పుకోనని యిప్పుడే రాహుల్ ఫోను జేసినాడు..." అంటూ యింటిగల్లాయనను హెచ్చరించాక, అతను లోపలికెళ్ళిపోయాడు.

అతడి వైపుకు చురచురా చూశాక "అమెరికాదుడ్డు వూరికే వస్తా వుంటే నేను గూడా యింకా పొదుగ్గానే మాట్లాడతాను." అన్నాడు యింటిగల్లాయన. తరువాత వెనుదిరిగి "రేయ్! మీవల్ల నా మింద మాట పడతా వుండాది. వొళ్ళు దగ్గిర బెట్టుకోని పని జెయ్యండి. నా కోపం వచ్చిందంటే మీ తుమ్మలగుంటోళ్లను యీ పక్క కార్యాలకు అడుగుబెట్టనీకుండా జేసేస్తాను?" అని బెదిరించాడు. అతను ముఖం చిట్లించుకుని లోపలికెళ్ళి పోగానే రత్నయ్య "నా అయిదు... నా అయిదూ" అని గంగయ్యను అనుకరిస్తూ యెగతాళి చేయసాగాడు.

గంగయ్య కొడతానన్నట్టుగా చేయి విసురుతూ "బొత్తిగా చిన్నా పెద్దా లేకుండా పోతావుండాదిరా నీకు! యితండంగా పనులు జేస్తే యీ పనులు గూడా లేకుండా పోతాయి జూసుకో! నోట్లోకి అయిదు యేళ్ళూ పొయ్యే తెరువేందో తెలుసుకోని బతకండి..." అన్నాడు. గోడపక్కన కూర్చుని బీడీ వెలిగించుకున్నాక "నా పెద్ద కొడుకేడ బోయినాడ్రా?" అని నర్సింహులు నడిగాడు.

బుగ్గలు నొక్కులు పడేలా ధమ్ములాగాక "యింకా యేడుండాడు? యెప్పుడో యెలబారి పోయినాడు" అన్నాడు నర్సింహులు. "పనిలోకి దిగేటప్పుడు కొంచేపు కనబడతాడు. మల్లంక సడీసప్పుడు లేకుండా మాయిమైపోతాడు. వాడుగూడా వచ్చినాడని జెప్పి నువ్వు రెండుభాగాలు దొబ్బేస్తావు. పని వొప్పించుకునింది గూడా నువ్వే అని జెప్పి పినపెద్ద భాగంగా యింకొంచెం వూడబెరుక్కుంటావు. యెప్పుడూ జరిగే భారతమే గదాయిది! కొంచెం యామారితే నీ చిన్న కొడుకును గూడా వచ్చి పొమ్మని జెప్పి, యింకో భాగంగూడా అడిగేటట్లుండావు..."

గంగయ్య గుడ్డసంచిలోంచీ కత్తిని తీసి నేలపైకి విసిరేస్తూ "యిట్లాంటి పనులకు నా చిన్న కొడుకు రమ్మంటే గూడా రాడు. వాడు కాలోజీలో సదివింది మీ మాదిరిగా మన్నులో దొర్లే దానికా?" అని యెద్దేవా చేశాడు. చిన్నబ్బ వెదురు కర్రను తీసుకుని, దాని బుడిపెలను కత్తితో జివరసాగాడు. రత్నం పెద్దగా నవ్వి "వొక కత్తితో పని జరిగితిందా?" అని అడిగాడు.

అతడి మాటలు పట్టించుకోకుండా "అవిలాల మాలోళ్ళను పిలుచుకోనుంటే తెలుసుణ్ణు.

యీ యరవకు వాళ్ళు యింటి ముందర వుప్పరపట్టె ఆడేసుందురు" అని గొణిగాడు గంగయ్య.

నర్సింహులు అతడికేసి నివ్వెరపోయి చూసి "అవిలాల మాలోళ్ళయితే మాత్రం వొక కత్తితో పనంతా యెట్ల జేస్తార్రా? మనూరినించీ చెంగడోళ్ళ మనుషుల్ని రప్పించుండినా, రెండో కత్తి లేకుంటే పంచేటయితింది" అన్నాడు.

బీడీ పొగ గొంతులోకి దూరడంతో గంగయ్య పొడిదగ్గు దగ్గుతూ "వాళ్ల ముగం! వాళ్ళ చేతల్లో అయిదు కత్తులుణ్ణా, మనదగ్గిరుండే వొకదాన్తో సమానమయితిందా? మనం నాయింగా పోతావుండామని, గిచ్చిగిచ్చీ బేరమాడకుండా పనుల్లోకి దిగతావుండామని, మనమంటే లెక్కలేకుండా పోతావుండాది. అవిలాలోళ్ళతో పడిలేస్తే గానీ మనమంటే యేందో వీళ్ళకు తెలవదు..." అన్నాడు. తర్వాత తనలో తానే మాట్లాడుకుంటున్నట్టుగా "వీళ్లదంతా అయింబుకారి బుద్ధి. కర్మాంతరాలప్పుడు మనల్ని తలవనుగూడా తలవరు. అప్పుడు ఆ మంగలోళ్లూ, బాపనోళ్లూ అడిగిందంతా చేతులు గట్టుకోని చచ్చినట్టు యిస్తారు" అని గొణిగాడు.

"పెండ్లిండ్లూ, దేవర్లకూ, కర్మాంతరాలకూ వచ్చి రకరకాలుగా దుడ్డు దండుకునే బాపనోళ్ల కండ్లెందుకో యీ చావుల మింద పడ్లేదు. లేకపోతే వాళ్ళు యీ సంపాదన గూడా మనకు దక్క నిచ్చుండరు" అన్నాడు నర్సింహులు.

"వాళ్ళంతా తెలివయినోళ్ళురా! యీ మాదిరి కస్మాలం పనుల్నంతా మనకిచ్చి, జబర్దస్తీగా తిరిగే పన్లనంతా వాళ్ళు దొబ్బేసినారు" అన్నాడు గంగయ్య కోపంగా. తరువాత గొంతుక్కూచుని బీడీగాల్చుకుంటున్న గోవిందయ్య కేసి తిరిగి "రేయ్! గోయిందూ! గొమ్మునా యెట్ల గుచ్చుంటావురా? ఆ దారాల్ని రాయితో నరకు"అని పెద్దగా కసిరాడు.

"రేయ్! గోయిందూ! గొమ్మునా యెట్ల గుర్చుంటావురా! ఆ దారాలు దీసి రాయితో నరకు!" అని హెచ్చరించాడు నర్సింహులు.

అప్పుడప్పుడూ వీధిలో కొస్తున్న సైకిల్లూ, స్కూటర్లూ నడి వీధిలో మండుతూ పొగలు వదలుతున్న చెక్కపేళ్ళను చూడగానే కంగారు పడిపోయి, పక్కకు తిరిగి, వేగంగా ముందుకెళ్ళి పోతున్నాయి. పొరుగింటి నుంచీ వచ్చిన వో ముసలావిడ నీరసంగా షామియానా దగ్గరికి నడుస్తోంది. యింటిలోపలి నుంచీ వీధిలోకి వ్యాపిస్తున్న నిశ్శబ్దం క్రమక్రమంగా బరువెక్కుతున్నట్టుగా అనిపిస్తోంది.

"యీ పక్క యెస్వీ నగరం కాన్నించీ, ముత్తాలరెడ్డి పల్లె దాంకా మన తుమ్మలగుంటోళ్ళకు వాడిక. దాంట్లో మజ్జిగ కాలవకు వుత్తరం పక్క యేరియా మనది. అవతలికుండేది చెంగడోళ్లది. పెద్దపెద్దోళ్ళ కాలంనించీ వస్తావుండే నాయిం యిది. మన పనుల్లోకి యింగొకడు చెయ్యి పెడితే గొమ్మునుంటానా? అడ్డంగా నరికి పారేస్తా దానెమ్మ!" నర్సింహులు నాలుకను పైపంటితో అణిచి పెడుతూ, కోపంగా గాండ్రించాడు. అతడి నల్లటి ముఖంపైన చెమట ధారలుగా పాకుతోంది. నిగనిగలాడుతున్న నర్సింహులు ముఖంకేసి చూస్తూ "మందుజాస్తీ అయినట్లుండాది. పెగ్గిపెరిగిపోతావుండాది..." అని గొణిగాడు గంగయ్య.

వొకదాన్కొకటి అతుక్కున్నట్టుగా కట్టిన యిండ్ల వరసలతో వీధి సన్నగా బక్క చిక్కి పోయినట్టుగా కనబడుతోంది. అక్కడక్కడా ఆకులు రాల్చుకున్న చెట్లు చేతులు

పైకెత్తుకుని యేదో పిర్యాదు చేస్తున్న వ్యక్తుల్లా వెలవెలబోతున్నాయి. యెండకు భయపడి యిళ్ల లోపలి వ్యక్తులెవరూ బయటకు రావడం లేదు. పరుగెత్తుకుంటూ వచ్చిన వీధికుక్కలు రెండు షామియానా కవతల నిలబడిపోయి, నాలుకలు బయటకు వేలాడేసుకుని రొప్ప సాగాయి. చిన్నబ్బ చేతికి దొరికిన రాయిని బలం కొద్దీ వాటివైపుకు విసిరాడు. కుక్కలు రెండూ పెద్దగా గెంతి, మొరుగుతూ దౌడు తీశాయి. అతడి పక్కన నిల్చుని కొబ్బరి దారాలను నిగ్గు చేస్తున్న రత్నం "వానెక్క !...భలే గురిరా నీది!" అని మెచ్చుకున్నాడు.

"తుమ్మలగుంట కాప్పల్లెకు కూత దూరంలో మన మాలపల్లె యెందుకుండేది?" పారిపోతున్న కుక్కలను చూసి దర్పంగా నవ్వేశాక నర్సింహులు వాదించసాగాడు. "కాపోళ్ళకు కయ్యా కాలవలున్నప్పుడు సేద్యం పనులు జేసిందెవురు? మనమా అవిలాలోళ్ళా? యిప్పుడైతే ఆవక్క పెరుమాళ్ళపల్లి కాన్నుంచీ, యీ వక్క తిరచానూరుదాంకా

కయ్యల్ని అమ్మేసి, యిండ్లు గట్టేసినారనుకో! అంతల మాత్రంతో మన పాయ కట్టులోవుండే పనులు మనవిగాకుండా పోతాయా? మనమే గాని లేకపోతే యీతావులో మట్టి పనులు జేసేదిక్కెవురు? సావుకార్యాలు నిభాయించే మనిషెవుడు? యిదంతా మన తాతముత్తాతలు రెక్కలు యిరుసుకోని, సంగటి తిన్నతావు గదరా? దీంట్లోకి యింగొకణ్ణి అడుగుబెట్టనిస్తామా యింత బతుకు బతికి?..."

"వొరే నర్సింహా! మా నాయిన చెప్పేటోడు..." అంటూ గంగయ్య వుత్సాహంగా అడ్డు తగిలాడు. "యీ పక్క రైలు రోడ్డు కానుకోనుండే మామిడి తోపులో పాదులు దవ్వతా వున్నప్పుడేనంట మా తాతను పురుగు ముట్టింది. యాడనుకోనుండావు? సరింగా యిప్పుడు యెల్బీ నగరు మాలోళ్లు గంగమ్మను తీరస్తారు జూడు, అదే తావులో..."

మా నాయినీ పక్కనుండే ముత్తాలరెడ్డిపల్లి మడి కట్లల్లో వుండే మిషనీషెడ్డులోనేనంట పుట్టింది." నర్సింహులు తెల్లటి మీసాలను వడితిప్పుతూ అందుకున్నాడు. "ఆ పొద్దు గూడా మా అవ్వ మడినాటకానికి పనికొచ్చిందంట! అక్కడ్నే నొప్పులొచ్చి అక్కడ్నే తీర్దమాడిందంట! అప్పుడే పుట్టిన బిడ్డను చంకనేసుకోని చక్కా యింటికెలబారి పొయ్యిందంట! చూసినోళ్ళంతా రెప్పాలోళ్ళ కోడలు సటపటమైంది గాదని ముక్కుపైన యేళ్ళేసేసినారంట! యేడనో దెలుసునా? సరింగా ఆ షెడ్డున్న తావులోనే యిప్పుడు భజనమందిరం గట్టుండారు..."

"చిన్నబ్బ గాడొకడే యెదురు జీలస్తా వుండాడు", వాళ్లిద్దరూ అదేపనయినట్టుగా బీడీలూది పారేస్తా వుండారు. యీపిల్లోళ్ళు మనకాలమయి పోయినాంక మన పేరు నిలబెట్టేటట్లు లేరు" అంటూ గంగయ్య కోపంగా పైకి లేచాడు.

" రేయ్ గోయిందూ, రత్నం! బిన్నాగా సవారీ గట్టండి. యీడి కొచ్చింది సట్టంగా అరుట్లు గొట్టే దానికి గాదు ..." అని కేకేశాడు.

"అప్పుటికి మీరిద్దరూ నీడలో గుచ్చోని చేస్తావుండేపనేంది మామా?" అని వెంటనే సవాలు విసిరాడు గోవిందయ్య.

నల్లరంగు మోటరు సైకిలొకటి వీధిలో యెవరూ అడ్డంరాకపోయినా పెద్దగా హారను మోగిస్తూ వచ్చి, షామియానా కింద ఆగింది. తెల్లటి ఖద్దరు చొక్కా, పాంటూ తొడుక్కున్న నల్లటి యువకుడొకడు రెండు మూడు మడతలుగా వేసి పట్టుకున్న పూలమాలతో సహా మోటరుసైకిలు వెనకసీటుపైన్నుంచీ కిందికి దిగాడు.

గంగయ్య చేతిలోని బీడీని దూరంగా విసిరేసి వుత్సాహంగా పైకి లేచి "అర్రర్రే! మోహనరెడ్డన్న!" అని అరిచాడు.

మోహన్‌రెడ్డి యింటిలోపలి కెళ్ళిపోయాడు. మోటరుసైకిలు హేండిలు పట్టుకుని కాళ్ళు నేలపైకి చాపుకుని, అలాగే సీటుపైన కూర్చున్న యువకుడి దగ్గరికెళ్ళి "అన్నకు వాళ్ళు బందుగులా?" అని అక్కరగా అడిగాడు గంగయ్య.

అతను తల అడ్డంగా తిప్పి "స్నేహితం" అన్నాడు.

మోటర్‌సైకిలుపైన కూర్చున్న వ్యక్తి జేబులోంచీ సిగరెట్టు పెట్టెను పైకి తీసుకుని, వెంటనే తలూపుకుంటూ దాన్ని మళ్ళీ జేబులోకి తోసేశాడు.

యింటిలోపల నుంచీ తిరిగొచ్చిన మోహనరెడ్డితో బాటూ వెనకే యిద్దరు వ్యక్తులు బయటికొచ్చారు.

"పొద్దన్నే వచ్చినా హైద్రాబాదునించీ... మళ్లా యిప్పుడు అర్జెంటు మీటింగు... దానం జేసేటయానికి వస్తా..." అని చెబుతూ మోహన్‌రెడ్డి మోటర్ సైకిలు వెనక సీటు పైకి శరీరాన్ని చేరవేశాడు.

గంగయ్య రెండు చేతులూ జోడించి, పెద్దగా పల్లికిలిస్తూ ముందుకొచ్చి "అన్నా! నేను! గంగయ్య! రెప్పాలోళ్ల గంగయ్య" అని పలకరించాడు.

మోహన్‌రెడ్డి ప్లాస్టిక్ డబ్బాలోంచీ నల్లకళ్ళద్దాలు తీసి, నాజూకుగా ముఖానికి తగిలించుకున్నాడు.

"మా చిన్నోడికి వుద్యోగంన్నా...మూడువారాలకు ముందర యింటికాడికొచ్చినాను... మూడువేలు రూపాయలు..."

మోహన్‌రెడ్డి వులిక్కిపడి తిరిగిచూసి "నువ్వా? ఆమాట ముందుగా జెప్తే గదా గెవనం వచ్చేది? ఆ పని పైన్నే వుండాన్లే! మల్లంక అగుపించు..." అన్నాడు. నల్లటి పొగల్ని విడిచిపెట్టాక మోటరు సైకిలు ముందుకు పరిగెత్తింది. 'పనంతా అట్నే పడుండాది. యింత తూగుముగం పనోళ్ళను నేనెప్పుడూ జూల్లేదు...' అంతవరకూ యింటిలోపల దాక్కున్న నిశ్శబ్దాన్ని తరమగొట్టడంకోసమన్నట్టుగా యింటి గల్లాయన పెద్దగా అరిచాడు.

'యింగ మాదేం పని బాకీ వుండాది సామీ! మా పిల్లోళ్లు సవారీ గడతావుండారు. మీరెప్పుడు చెప్తే అప్పుడు మా పలకలు మోగిపోతాయి.' అన్నాడు గంగయ్య పెదవులు సాగదీసి నవ్వుతూ.

వెదురు దబ్బలను త్రిభుజాకారంలో కట్టి వాటికి పొడవాటి దారాలను వేలాడదీస్తున్న నర్సింహులు తమకేసి విసుగ్గా చూస్తున్న యింటిగల్లాయనతో "తలకొరివి గూడా రెడీ సామీ!" అన్నాడు పరవశంగా.

యింటిగల్లాయన ముఖాన్ని చిటపటలాడించుకుంటూ వెళ్ళిపోయాడు.

దారాల పొడవును చేతి జానలతో కొలుస్తున్న నర్సింహులు పక్కకెళ్ళి కూర్చుని "మోహనరెడ్డన్నను జూస్తివారానర్సింహా! ఆ రూపూ, గుణమూ అట్టట్నే వాళ్ల నాయిన మాదిరే దిగబడినాడు. యెప్పుడూ పదిమంది చుట్లా కమ్ముకోనుంటారు. పులిబిడ్డ పులిబిడ్డే!" అన్నాడు గంగయ్య. బీడీ వెలిగించుకుని రెండు ధమ్ములు లాగాక "వాళ్లనాయిన నాకంటే గూడా పసోడు. కాలం తీరి పోయినాడు. పిల్లోడుగా వుండంగానే యీ అన్న పైకి కాడిపడింది. తిరపతి కొచ్చే పెద్ద పెద్దోళ్ళుగూడా వీళ్ళింటికి రాకుండా తిరుక్కోని పోరు. ఆ యింటికాడ వచ్చే జనమూ, పొయ్యే జనమూ, యెప్పుడూ తిరణాళ మాదిరిగా వుంటాది. మనూర్లో ముగ్గురుపిల్లోళ్లకు యిస్కూలయివోరి వుద్దోగాలు వచ్చిందెవురివల్ల? అన్నగాని లేకుంటే అవి మనూరి దాంకా వచ్చుణ్ణా? యెట్లయినా మా చిన్నోడికి యేదోవొక వుద్యోగం తీసిమ్మని తిరగతా వుండాను. కొంచెం కర్చయితాదన్నాడు. యింత బతుకూ బతికి మన కోసరం ఆయన్ను ఖర్చు బెట్టుకోనిస్తామా? యెంతయినా యెనకాడేదిలేదు బాంచెత్!"

"తూనీమ్మ! పైకి లెయ్యండిరా!" నర్సింహులు వుగ్రమొచ్చిన వాడిలా పైకి లేవడంతో గంగయ్య మాట్లాడడం ఆపేశాడు. మళ్లీ నక్కాముట్టి ఆటలోకి దిగబోతున్న వాళ్ళ పైకి తుఫానులా విరుచుకుపడ్డాడు నర్సింహులు. "పైకిలేచి మంటేసి, పలకలు చేతలకెత్తుకోండి. ఆ కసువు కట్టయిప్పి సవారీపైప పరవండి. చెయ్యాలంటే పనేలేదా మీకు?"

"హూ! యీ కట్టూ గిట్టూ మానం మర్యాదా మనతో గూడా మట్టి గొట్టుకోని పొయ్యేటట్టుండాదిరా నర్సింహా! వీళ్ళిట్నే వుంటే వూర్లో వాళ్ళు దిగ్గొలికేస్తారు. మల్లంక వీళ్లు తిరిపమెత్తుకోని బతకాల్సిందే!" అంటూ గంగయ్య నిట్టూర్చాడు.

యింటిలోపలినుంచీ యిద్దరు వ్యక్తులు పొడవాటి బెంచీని తీసుకొచ్చి వీధిలో వేశారు. దానిపైకి రాబోయే శరీరాన్ని యిప్పుడే చూస్తున్నట్టుగా అటే చూస్తూ కుక్కపని కుక్క జెయ్యాల. యెద్దుపని యెద్దు చెయ్యాల!' అన్నాడు నర్సింహులు. "మనం మనకు పెద్దోళ్లు చెప్పేసి పోయిన పనులు చేసుకోని బతకాల గానీ వుద్దోగాలని తిరిగితే యేమయితింది? యిందుకేనేమో బమ్మంగారు కలిగ్గానికి అంతమని జెప్పేసి పొయ్యుండేది!..' నర్సింహులు వోసారి చుట్టూ తలతిప్పి చూసి, యెవరూ తనను గమనించడం లేదని అనుకున్న తర్వాత, డ్రాయరు జేబులోంచీ సీసా తీసుకుని గుటగుటా తాగేశాడు.

"నీ కొడుకులు ముగ్గురికీ చదువులు రాలేదని, మావోడు కాలేజీదాంకా యెక్కొచ్చినాడనీ నీకు కండ్లు కుడతావుండాది లేరా!" అంటూ గంగయ్య రుసరుసలాడాడు. "మా చిన్నోడు అందురిమాదిరి గాదు. పాంటేసుకోని తెల్లారితో టౌనుకు పోయినోడు సాయింత్రానికిగానీ యింటికి తిరుక్కోని రాడు. పెద్ద పెద్దోళ్ళతో సావాసం. సంగటీ సలిబిండీ తినడు. మల్లెపుష్పాల మాదిరి తెల్లంగా అన్నం వండి పెడ్తే రెండు పిడికిల్లు నంజతాడు. సదువుకున్నోళ్ళకుండే తెలివి యీ మొరుటుగుంపుకెట్లొస్తింది?"

యింటిలోపలినుంచీ నలుగురు మొగవాళ్ళు శవాన్ని తీసుకొచ్చి బెంచీపైన పడుకోబెట్టారు. కొందరు ఆడవాళ్ళు కళ్ళుతుడుచుకుంటూ చుట్టూ నిల్చున్నారు. చుట్టుపక్కల యిళ్ళవాళ్ళు కొందరు వాళ్ళ గడపల దగ్గరనిల్చుని షామియానా వైపుకు

బిత్తరచూపులు చూస్తున్నారు. వీధిలో వేగంగా వచ్చిన స్కూటరొకటి దారి కడ్డంగా నిలబడిన గుంపును తిట్టుకుంటూ ముందుకెళ్తోంది.

గడ్డిపరిచిన వెదురు కర్రల సవారీపైన అరిటాకులు కప్పి టెంకాయదారంతో కట్టసాగాడు నర్సింహులు. మిగిలిన ముగ్గురూ షామియానా కవతల గడ్డిని రగిలించి, పలకలను మంటలపైన కాకెక్కిస్తున్నారు.

దాదాపు ముప్పయ్యేళ్ళ వయస్సున్న యువకుడొకడు గుంపులోంచీ గంగయ్య దగ్గరికొచ్చి "నీది తుమ్మలగుంట గదా! నువ్వు... యిక్కడ ?" అని యెగాదిగా చూశాడు.

గంగయ్య నవకంతో ముఖం తుడుచుకుంటూ "నేనే... నేనేసా" అని సిగ్గు పడిపోయాడు. తర్వాత "యీ పక్క మట్టి పన్లంతా మావే లేసా..." అన్నాడు.

అతను ముఖాన్ని యెర్ర బార్చుకుంటూ "అయితే యింటిపిల్లర్లకు పౌండేషను గుంతలు తవ్వేదీ, శ్మశానంలో సమాధులకు గుంతలు దీసేదీ, రెండూ వొకటేనా?" అని రెట్టించాడు.

వేడెక్కుతున్న పలకలపైన బోద పుల్లలు మోదుతున్నాయి. శవం దగ్గర నిల్చున్న జనంలోంచీ యెవరో పెద్దగా అరుస్తున్నారు.

" ఛ...ఛ..." అంటూ గంగయ్య నాలుక కరచుకున్నాడు. "పెండ్లీ చావూ రెండూ వొకటే యెట్లవతాయి సామీ! తవ్వేది గుంతలే అయినా తవ్వే మనుషులు వేరే! ఆ పని జేసేవాళ్ళను యీ పని కాడికి రానీను. వీళ్ళను ఆతావుకు అంపీను. శుభంగా జేసే పన్లంతా నా పెద్ద కొడుకు జూసుకుంటాడు."

"రేపు తెల్లారి అయిదుకు ముహూర్తం. అప్పటికి గుంత రెడీగా వుండాల..."

"యీ వేళకు మావోడు ఆతావులో తవ్వతావుంటాడు. మాటిస్తే యెనక్కుతగ్గే వంశంగాదు మాది."

అతను అనుమానంగా చూస్తూ మళ్లీ గుంపులో కలిసిపోయాడు.

తన పలకపైన అరిచేత్తో దరువేసి చూశాక "నీ పెద్ద కొడుకును ఆపనిపైన అంపిస్తివా మామా?" అని అడిగాడు గోవిందయ్య.

"ప్చ్...ప్చ్..." అని పెదవులు చప్పరించి 'యీ మనిషి ఆపక్క కుప్పం బాదూర్లో బాంకీ ఆఫీసరంటలే! క్రిష్ణా నగర్లో యింటిపని మొదులు బెడతావుండాడు. మేస్త్రీ మునిరత్నంరెడ్డి మట్టిపని నాకిచ్చినాడు. మన కూలీలో గూడా కమీషను గొట్టేస్తాడు ఆ మేస్త్రీ. రేపు తెల్లారితో పూజ. గుంతదవ్వి శంఖుస్థాపనంజెయ్యాల. యీ పనవతానే క్రిష్ణా నగరుకు బోండి. మార్కింగు జేసిన తావులో గుంతదవ్వండి. ఆకూలీ దుడ్డు మీకే యిస్తా ..." అన్నాడు.

"యీ పొద్దుకు యీ పనీ, యీ కూలీ దుడ్డూ చాల్చాలు. యింటికి పొయ్యి రెండు పిడసలు తినేసి పండుకుంటే పాణమేడికి పోతిందో తెలవదు..." అని తేల్చి పారేశాడు చిన్నళ్ళు.

"అప్పటికి నేనేనా సన్నకష్టంబడుండేది? అనావస్యంగా వొళ్ళు నలగ్గొద్దుకునే అగత్యం నాకు లేదు" అంటూ పలకపైన మరో దరువందుకున్నాడు గోవిందయ్య.

"యీ పొద్దు జరిగిపోతే సాల్లేరా మీకు! రేపుటికింత మిగలిబెట్టు కుందామని అనుకోరు." గంగయ్య వాళ్ళ వైపుకు వుక్రోశంగా వురిమిచూశాడు. "మీ కోసరమనే గదా నేను వూరంతా తిరిగి పనులు వొప్పించుకునేది? పని లేకపోతే యేడస్తారు. రెండు పనులొస్తే జారుకుంటారు. యిప్పుడే కొండలు గొట్టినారని మీ వొళ్ళు అలిసుండేది? మందు పడితే యింక మీరు మనుషులే గాదు..."

వున్నట్టుండి పలకపైన పెద్దగా మోదుతూ చిన్నబ్బ అర్థంపర్థం లేని పాటను గొంతెత్తి గీపెట్టాడు. చుట్టూ వున్న మనుషులందరూ తనవైపుకు తిరిగి చూడ్డం గమనించగానే అతను మరింత పెద్దగా రాగంతీయసాగాడు.

యింటిగల్లాయన గంగయ్య దగ్గరికొచ్చి "టపాసులెంతకు దెచ్చినావు?" అని అడిగాడు.

"ఆరునూర్లకు తెమ్మంటివి గద సామీ!" అంటూ గంగయ్య సంచిని చూపెట్టాడు.

"అవి ఆరు నూర్లా? సగం బాగ్గుకు గూడా లేవు.." యింటిగల్లాయన నొసలు చిట్లించుకున్నాడు.

"ఛ..ఛ...టపాసుల్లో కమీషన్లు గొడతానా సామీ! పాపం గదా? సామాన్ల పట్టీ అంగిడోడు యిచ్చింది అట్నే తెచ్చినా... కావాల్సుంటే లెక్క జూసుకో..." అన్నాడు గంగయ్య తన మురికి చొక్కా జేబులోంచీ కాగితాన్ని తీసి యిస్తూ.

"టపాసులు గాల్చే దెవురు?" అని యింటిగల్లాయన నిర్లక్ష్యంగా అడిగాడు.

"నేనే సా...అందుకే నేను పలక తేలేదు" అన్నాడు నర్సింహులు ముందుకొచ్చి.

"నువ్వా? పనోడైతే ధైర్యంగా కాలస్తాడు..."

"అప్పుటికి నేను ముసిలోణ్ణనుకుంటావుండావా సామీ! నా వొయిసెంతను కోనుండావు? బిన్నాగా యెంటికలు తెల్లగా అయిపోయినాయంతే! యెంతపెద్దబాంబునైనా నేను యెడం చేత్తో కాల్చి పారేస్తాను ..."

"అన్ని సెంటర్లలో మోగిపోవాల... మిగలబెట్టుకోని యింటికెత్తుకోని బోయినావని తెల్సిందనుకో, నేను గొమ్మునుండను..."

గుంపులోంచీ యెవరో "అంతవుడుగ్గా నీళ్ళు బోస్తే యెట్ల? కొంచెం చల్లనీళ్ళు కలపండి" అని అరుస్తున్నారు. మరెవరో "బతికున్నప్పుడు చల్లనీళ్ళే గతి. యిప్పుడైనా వుడుకుడుగ్గా పోసుకోనీ..." అని వాపోతున్నాడు. బెంచీపైన శవం పక్కన కూచున్న ముసలావిడ నెత్తిపైన కూడా వేడినీళ్ళు గుమ్మరిస్తున్నారు. ఆవిడ గడ్డ గట్టుకుపోయిన మంచు బొమ్మలా కనబడుతోంది. అయిదారుమంది కలిసి శవాన్ని సవారీపైకి తరలించారు. యింటి గల్లాయన గంగయ్యకేసి చూశాడు. "కట్టుబోరా నర్సింహా!" అని పురమాయించాడు గంగయ్య. అతను రెండడుగులు వెనక్కేశాడు. "ముందుగా గుర్రమెక్కితే సరిపోతిందా? మినకరించకుండా పనిజెయ్యి" అని కసిరాడు గంగయ్య.

"బజారు నించీ వస్తావస్తా నువ్వు గొమ్మునావచ్చుంటావా? దోవలో గొంతులదాంకా పట్టించుకోనొచ్చుంటావు" అంటూ నర్సింహులు రోషంతో బుసలు గొట్టాడు.

"రావుకాలం వస్తావుండాది. బిన్నాగా రండ్రా!" యెవరో గాండ్రిస్తున్నారు. నర్సింహులు గంగయ్యను మింగేసేలా వురిమిచూస్తూ శవం పక్కన గొంతు క్కూచుని, నవారీ గట్టసాగాడు.

గంగయ్య చేతిని పట్టుకుని షామియానా కవతలికి లాక్కెళ్ళాడు రత్నయ్య. పంచె కిందున్న గాడాగుడ్డ డ్రాయరు జేబులోంచీ జానెడు పొడవున్న సీసాను పైకితీసి "నీ భాగం పెద్నాయినా!" అన్నాడు.

గంగయ్య గబుక్కున దాన్ని లాక్కుని "హి హి హీ... నీది పెద్ద బుద్దిరా! మీ నాయిన గూడా యింతే!" అని మెచ్చుకున్నాడు. వీధిలో కాస్త ముందుకెళ్ళి, రెండు యిండ్ల మధ్యలోని మురికి కాలవగట్టుపైకి నడచాడు. సీసా మూత తీసి, గుటగుటా తాగేశాడు. నోట్లోంచీ వేడివేడిగా వూపిరి బయటకు వదులుతూ, ఖాళీ సీసాను నడుముదగ్గర, పంచ మడతల్లోకి చెక్కేశాడు. అతను షామియానా దగ్గరికొచ్చే సరికి పలకలు బీభత్సంగా మోగిపోతున్నాయి.

యస్వీ నగరు వీధి యూనివర్సిటీరోడ్డులోకి మలుపు తిరిగే చోట పొడవాటి టపాసుల సరాన్ని నేలపైన పరచి, నర్సింహులు వూదుకడ్డీతో రగిలిస్తున్నాడు. నలుగురు మనుషులు శవాన్ని భుజాలపైకెత్తుకున్నారు. నిలువెల్లా నీళ్లతో తడిసిన ముసలావిడ శరీరం చలికి సైతం వణకడం లేదు. యింటిగల్లాయన గంగయ్యకేసి చూస్తూ యేమిటో అరుస్తున్నాడు. గంగయ్య సంచినీ, కత్తినీ చేతికెత్తుకున్నాక ముసిముసి నవ్వులు నవ్వసాగాడు.

శవంతో బాటూ కొందరు మగవాళ్లు మాత్రమే ముందుకు కదిలారు. షామియానా కింద మిగిలిపోయిన ఆడవాళ్లు యేడవకపోతే బాగుండదన్నట్టుగా ముక్కులు నలుపుకుంటున్నారు.

ముందుగా నడచిపోతున్న పలకలవాళ్ళను యెవరో ఆగమని సైగ చేస్తున్నారు. వాళ్లు దగ్గరికొచ్చాక 'యెందుకట్ల పరిగెత్తతారు? మేంగూడా రావద్దా? మెల్లింగా నడవండి' అని ఆజ్ఞాపించాడో వ్యక్తి. వాళ్ళు పెద్దగా నవ్వుతూ సంతోషాన్నంతా పలకలపైన చూపించసాగారు. అందరికంటే ముందుగా మరో కూడలిని చేరుకున్న నర్సింహులు పెద్ద బాంబును వెలిగించే ప్రయత్నంలో వున్నాడు. యెదురుగా వస్తున్న కారొకటి రోడ్డుపైన పగులుతున్న టపాకాయల్ని తిట్టాక, శవాన్ని మోసుకొస్తున్న గుంపుకు దూరంగా తిరిగి తుర్రు మంది. యింటిగల్లాయన మళ్లీ గంగయ్య కేసి తిరిగి పెద్దగా చేతులూపుతూ యేదో చెప్పసాగాడు. కత్తిని సంచీలోకి పడేసి, దాన్ని చంకకు తగిలించుకున్నాడు గంగయ్య. పక్కనున్న వ్యక్తి దగ్గరినుంచీ పూలమాలలున్న గంపను నెత్తికెత్తుకున్నాడు. గంపలోంచీ పోమాల తీసి శవం పైకి విసిరేశాడు. అది శవంపైన్నుంచీ అటువైపుకు దొర్లి కిందపడి పోయింది. శవాన్ని మోస్తున్న వాళ్ళు నలుగురూ కలిసి గంగయ్యను బృందగానంలా తిట్టసాగారు. గంగయ్య మరింతగా సిగ్గుపడిపోయి నవ్వుతూ పూలమాలలను చిన్న భాగాలుగా తుంచి విసరసాగాడు.

పద్మావతీ యూనివర్సిటీ ముఖద్వారం దగ్గర నిల్చున్న ఆడపిల్లలు కొందరు రోడ్డుపైన శవయాత్ర కనిపించగానే లోపలికి పరిగెత్తారు. ద్వారం పక్కన ఆటోల నాపుకుని నిల్చున్న

డ్రైవర్లు వూరేగింపును నిర్లిప్తంగా చూడసాగారు. రోడ్డుకు తూర్పువైపున వున్న బంగళాలలో మనుషులున్న సందడి కానరావడం లేదు.

తుమ్మలగుంట కూడలిని చేరుకున్నాక బాగా ముందుకెళ్ళిపోయిన పలకలవాళ్ళను వెనక్కు రమ్మని వో ముసలాయిన కేకేశాడు. రోడ్డు పైకి దింపిన శవం పక్కన పూలగంపను పెడుతూ "దింపుడు కళ్ళంరా! వచ్చి కర్పూరం ముట్టించు" అన్నాడు గంగయ్య.

నర్సింహులు కర్పూరం వెలిగిస్తూ శవంకేసి చూసి "ముసిలోడే!" అని పెదవులు చప్పరించాడు. గంగయ్య యింటి గల్లాయన దగ్గరి కెళ్ళి వినయంగా వంగి "తలకొరివి తెస్తావుండే పెద్దాయిన కొడుకుతో చెప్పి పాతగుడ్డలు యినాం దీసియ్యాల సామీ!" అని అడిగాడు.

"రేయ్! కర్పూరం కొంచెం కొంచెంగా ముట్టించు. మీదేం పొయ్యింది...? తెచ్చిందంతా యిక్కడ్నే ముగించేసి మళ్ళా తెమ్మంటారు అని హెచ్చరించాక యింటిగల్లాయిన "వాడు కొడుకు గాదు. పాత గుడ్డలు గావాలంటే ముసిలాయన్నే అడగాల..." అన్నాడు.

"అయ్యయ్యో! మొగ బిడ్డలు లేరా?" అంటూ గంగయ్య దెబ్బతగిలినట్టుగా బాధపడసాగాడు.

"కొడుకెందుకు లేడు? లక్షణంగా వుండాడు అమెరికాలో... అక్కడ్నించీ దుడ్డు వస్తావుండంగానే యిక్కడిట్లా సావులు గూడా ఆర్భాటంగా జరగతా వుండాయి..." అని ముఖం ముడుచుకున్నాడు యింటిగల్లాయన.

శవం పక్కకు వెళ్ళాక "పేరు పెట్టి పిలవాలన్నా! పేరేందో చెప్పండి", అని అడిగాడు నర్సింహులు.

గుంపులోంచీ "పరుశురామ్మూర్తి... పరుశురామ్మూర్తి" అన్న జవాబు వచ్చింది.

నర్సింహులు శవం చెవి దగ్గరికి వంగి "పరశురామ్మూర్తీ! పరశరామ్మూర్తీ! పరశరామ్మూర్తీ !" అని పిలిచాడు. "మొత్తం మూడుతూర్లు... యీ లోకంలో రుణం వుంటే లేచి కుచ్చుంటాడు. లేకపోతే నమ్మకంగా కాటికెత్తుకోని పోవచ్చు!" అంటూ జనం కేసి దర్పంగా చూశాడు.

శవాన్నెత్తుకున్న మనుషులవెనక చిన్న గుంపు నివ్వెరపోతూ మళ్ళీ కదిలింది. యింటిగల్లాయన కోపంగా చూస్తూ కనిపించగానే గంగయ్య పూలమాలల తుంటల్ని శవంపైకి విసిరేయసాగాడు.

వుప్పరపల్లె శ్మశానం దగ్గరికెళ్ళాక నర్సింహులు నాలుగు బాంబుల్ని వరసగా పేల్చాడు. పలకలవాళ్ళు రోడ్డుపక్కనున్న కంచెలోంచీ నాలుగు కంపల్ని బయటికి యీడ్చి, కాలిబాటగుండా శ్మశానంలోకి దారితీశారు. అంతవరకూ శ్మశానంలోని యినపరేకుల షెడ్డు కింద కూర్చుని యెదురుచూస్తున్న యిద్దరు వ్యక్తులు పైకి లేచారు. అప్పుడే తవ్విన గుంతపక్కనున్న మట్టి దిబ్బపైకి శవాన్ని చేర్చారు.

శ్మశానాన్ని ఆనుకుని నాలుగైదు గుడిసెలూ, రెండుమూడు మిద్దెలూ వున్నాయి. వాటిపక్కన పొడవాటి సిమెంటు స్థంభాలపైన నీళ్ళటాంకరొకటి రొమ్ము విరుచుకుని నిలబడివుంది. శ్మశానానికి దక్షిణంగా యిసుకను పోగొట్టుకున్న పిల్లకాలవొకటి

గుంతలలోపల దాక్కొంటోంది. అప్పుడే తవ్విన గోతి పక్కన, పంచెలు పైకెత్తి కట్టుకున్న యిద్దరు నల్లటి వ్యక్తుల్ని చూసి తలపంకిస్తూ "కాట్లో తావులేకుండా పోతావుండాదంట! యీ తావులో యింకపైన పూడ్చేది లేదనీ, కాల్చాల్సిందేననీ ఆ పక్క బోర్డేసుండారు." అన్నాడు గంగయ్య.

"కాట్లో గూడా యిండ్లు గట్టేస్తే యింగ తావెట్ల మిగిలితింది? పోలీసుల్తో చెప్పి వాళ్ళనంతా బొక్కల్లోకి తోసేయించాల..." అన్నాడు నర్సింహులు కసిగా.

"ఛత్...గొమ్మునుండు. వాళ్ళెవురనుకోనుండావు? మన మోహన్రెడ్డన్న మనుషులు. అయన జెప్తే వూరికి నడిమధ్యల్లో వుండే మటం మనుషులే తోకలు ముడుచుకుంటారు. యిదంతా డీకేటీ . . . యిదొాకలెక్కా?" గంగయ్య రోషంతో మీసం మెలేశాడు.

యెండ పెళపెళ గాయడంతో మనుషుల నీడలు వాళ్ళ పాదాలకింద దాక్కుంటున్నాయి. యినపరేకుల షెడ్డులోకి చేరిన ఆరేడుమంది మనుషులు చెమటలు కక్కుకుంటున్నారు. శ్మశానానికవతల యిండ్ల మధ్యలోంచీ నీళ్ళ బిందెను మోసుకెళ్తున్న పదేళ్ల అమ్మాయి యిటుకేసి తలతిప్పడం లేదు. గోతికి పదిబారల దూరంలో వున్న యింటిలోపలినుంచీ టీవీశబ్దం స్పష్టంగా వినబడుతోంది.

శవం చుట్టూ నిల్చున్న వ్యక్తులు యేవో క్రతువులు చేసుకుపోతున్నారు. గుంత దగ్గరినుంచీ పరిగెత్తు కొచ్చిన నల్లటి మనిషి గంగయ్య దగ్గరి నుంచీ కత్తిని తీసుకున్నాక "గుంతలోకి పోసే దానికి బియ్యం దెచ్చేది మరిచి పోయినారంట! మనం గెవనం జెయ్యలేదని ఆ మనిషి ఆగమాగం జేస్తా వుండాడు. గుంతను పొడుగ్గా లోతుగా తొాగలేదని యెగిరి దూంకతా వుండాడు" అంటూ అనుకోని ప్రశంశలకు ఆనందపడుతున్న వాడిలా నవ్వసాగాడు. తరువాత పంచెకిందున్న డ్రాయరు జేబులోంచీ రెండు చిన్న సీసాలు పైకి తీసి "యిది మీ యిద్దురి భాగం" అన్నాడు.

"మీరిద్దురూ రెండు పుల్లు బాటిల్లు గొట్టేసినారా?" అనుమానంగా అడిగాడు గంగయ్య.

"పుల్లు గొడితే గొంత తొాగేకయితిందా?" అతను పెద్దగా నవ్వేశాడు.

నర్సింహులు తన సీసామూత తీసి వాసన చూస్తూ "అర్దమైనా గొంతు దిగితే గానీ మీకు కాట్లోకి దిగేదానికి ధైర్నం రాదు. గుంత తొాగతా యింకోసగం పీల్చేసుంటారు. వొాట్టి బెదురు గొడ్లు గదరా మీరిద్దురూ!" అని చెప్పాక యిద్దర్నీ పేరుపేరునా పిలుస్తూ ప్రేమగా బూతులు అందుకున్నాడు.

తుమ్మలగుంట వైపునుంచీ వచ్చి ఆగిన మోటరు సైకిలును చూడగానే గంగయ్య దిగ్గున పైకిలేచి "మోహన్రెడ్డన్న!" అని ప్రకటించాడు.

తనపక్క కొచ్చి నిల్చున్న మనిషిని గమనించకుండా "యింకా యెంతసేపు పడితింది?" అని అడిగాడు మోహన్‌రెడ్డి.

"అయి పొాయ్యిందన్నా! యింగేముండాది? పూడ్చేసేదే!" అన్నాడ గంగయ్య. యెంతకూ అతను తనకేసి తిరిగి చూడక పోవడంతో "అన్నా! అన్నా! యింటికాడికి దానాతూర్లు వచ్చుంటిని..."అని గునిశాడు.

"పుద్యోగాలు చెట్లకు గాస్తా వుండాయిరా ?" మోహన్‌రెడ్డి విసుక్కున్నాడు.

"యేందో వొాక చిన్న బిళ్ళేసుకునే పుద్యోగమైనా ... అందుకనే మూడువేలు ..."

"సరే చూస్తాన్లే! ముందు వాళ్ళను బిన్నాగా పూడ్చమను. నేనుపోవాల్ల... "

గంగయ్య గస బోసుకుంటూ గుంతదగ్గరికి పరిగెత్తి "అన్నకు పనుండాదంట. బిన్నాగా పూడ్సండి" అని అరిచాడు.

నర్సింహులు శ్మశానంలోంచీ రోడ్డుపైకి పాకుతున్న కాలిబాటపైన సవకాన్ని పరిచి, అది గాలి కెగిరిపోకుండా నాలుగు మూలల్లో నాలుగురాళ్ళు పెట్టాడు. చిన్నబ్బ దాని దగ్గరికొచ్చి, పలకపైన రెండు దరువులు వాయించి "గుంత యినాం సామీ! గుంతయినా మన్నా! అందురూ చిల్లరేసేగావాల్ల ." అని దండోరా వేశాడు.

గంగయ్య మళ్ళీ మోహన్‌రెడ్డి దగ్గరికొచ్చి "చచ్చిపోయిన పెద్దాయినకూ, మీ నాయినకూ భలే స్నేగితమంట గదన్నా! గెవనం బెట్టుకోని కాటి కాడిక్కూడా వచ్చినావు. యెంతయినా నీది పెద్ద మనుసు" అని మెచ్చుకున్నాడు.

మోహన్‌రెడ్డి ముభావంగా "ఆయిన గాదు ఫ్రెండు. ఆయిన కొడుకు నాకు ఫ్రెండు. అమెరికాలో వుండాడు" అన్నాడు. తరువాత తనను మోటరుసైకిలుపైన తీసుకొచ్చిన వ్యక్తి కేసి తిరిగి "నేను దగ్గిరలేకుంటే వీళ్ళు యే పనిగానీ సక్రమంగా జెయ్యరని రాహుల్ అన్ని తూర్లు ఫోను జేసి చెప్పిందిందుకే! వాళ్ళను జూడు. గుంత గూడా సరైన తావులో తవ్వలేదు" అన్నాడు విసుగ్గా.

"వచ్చి రెండుపిడికిల్లు మన్నేసి పోన్నా!" అంటూ శ్మశానంలోంచీ పిలుపొచ్చింది. మోహన్‌రెడ్డి కంటే ముందుగా గుంతదగ్గరికి పరిగెత్తిన గంగయ్య పారతో మట్టిని కుప్పగా తోసి "యిదెత్తుకోన్నా!" అని ప్రాధేయ పడ్డాడు. మోహనరెడ్డి చేతికంటిన మట్టిని రుమాలుతో తుడుచుకుంటూండగా "అంతారుణం...యెవురెవురి రుణం వాళ్ళు తీర్చుకోవల్సిందే!" అంటూ గంగయ్య నిట్టూర్చాడు.

నర్సింహులు కాలిబాటపైన వస్తున్న మనుషులకంతా అడ్డు తగులుతూ "గుంతయినాం...గుంతయినాం.." అని గెంతసాగాడు. నల్లటి మనిషొకడు మిగిలిన మట్టినంతా గుంతపైకి తోసి, సమాధిని ముక్కోణాకారంలో మెత్తసాగాడు.

పలకలు దబదబా మోగుతూండగా గంగయ్య యింటి గల్లాయిన దగ్గరికొచ్చి "మా కియ్యాల్సిన దుడ్డు యిక్కడ్నే యిచ్చేయాల్ల సామీ! అదే సాంగెం" అని అడిగాడు.

సవకంపైకో పదిరూపాయిల కాగితాన్ని విసిరిన మోహన్‌రెడ్డి "యీ మాలోళ్లకు మందెక్కువయి నట్లుండాది. గుండం దొక్కినట్టుగా యెగరతా వుండారు" అన్నాడు.

రత్నయ్యా, చిన్నబ్బా పలకలు మోగిస్తూండగా మరో యిద్దరు యువకులు పాంటులు పైకి మడుచుకుని యిష్టం వచ్చినట్టుగా యెగురుతున్నారు.

"ఆ తెల్ల పాంటోడు నా కొడుకన్నా! ఆ బులుగుపాంటోడు మా గంగని చిన్న కొడుకు కోదండడు. యిప్పుడే వచ్చినారు వాళ్ళిద్దరూ... ఆ కోదండని కోసరమే గంగడు వుద్యోగమడిగుండేది..." అన్నాడు నర్సింహులు వుత్సాహంగా.

మోహన్‌రెడ్డి నల్ల కళ్ళద్దాలలోంచీ చూపులు తిప్పి "వాడేనా కాలేజీలో చదివింది?" అని అడిగాడు.

"వాడేన్నా! వాడే!" అంటూ వుద్వేగంతో జవాబు చెప్పబోయిన గంగయ్య సందేహిస్తూ ఆగిపోయాడు. "యెవురెవురు యే పని జెయ్యాల్నో పెద్దోళ్ళు యిలావిరిగా జెప్పేసి

పోయిందెందుకన్నా? వుద్దోగం వచ్చినా గూడా కులకట్టు తప్ప గూడదు గదన్నా! యెవురిదాంకానో యెందుకు? మీ నాయిన పోతానే ఆ పనులంతా నీకు చుట్టుకోలేదా? వూరికోసరమని చిన్న వొయిసులోనే నువ్వు మేడిపట్టుకోలేదా?"

మోటరు సైకిలు కదులుతూండగా "యింకో మూడు వేలు సర్దుకున్నాంక గనబడు" అన్నాడు మోహన్‌రెడ్డి.

తడబడుతూ యేదో చెప్పబోయిన గంగయ్య మాటలు గొంతుదాటి రాలేదు.

"వీళ్ళిద్దరూ తొలీ సినిమా జూసుకోని యింటికి పోతా యిట్లొచ్చినారు. యెస్సీ నగరమోళ్ళు అంపించిన అడ్వాన్సుతో మూడు సీసాయిలు తెమ్మని వాళ్ళను అడుక్కున్నాము. తెస్తా తెస్తా వీళ్ళు దోవలోనే కొంచెం ఖాళీ జేసుకోని వచ్చినారు. పలకలు వాయిస్తావుంటే యింక వాళ్ళను పట్టేదానికెవురివల్లయితాది ?..." సమాధి పని పూర్తి చేసిన మనిషి రోడ్డుపైకొచ్చి, కదం తొక్కుతూ చెప్పుకుపోయాడు.

పలకలు మోగిస్తున్న వ్యక్తుల పక్కన, యిదివరకూ అడుగేస్తున్న యిద్దరు యువకులతో బాటూ, మరో యిద్దరు మనుషులు వూడిపోతున్న పంచలనూ, భుజాలపైన్నుంచీ జారిపోయిన సవకాలనూ పట్టించుకోకుండా యెగురుతున్నారు.

శ్మశానంనుంచీ రోడ్డుపై కొచ్చిన వాళ్ళందరూ నిశ్శబ్దంగా తిరుగుదారి పడుతున్నారు. యింటిగల్లాయిన యిస్తున్న డబ్బులు చాలవన్నట్టుగా తలవూపుతూ పలకలవాళ్ళు దరువేస్తున్నారు. గుంపులోంచీ వచ్చిన యువకుడొకడు కోపంగా రుసరుసలాడుతూ రెండునోట్లు తీసి వాళ్ళ ముందుకు చూపాడు. అతడి దగ్గరినుంచీ డబ్బులు తీసుకున్నాక గంగయ్య గబగబా కంచె పక్కనున్న చెట్టు చాటు కెళ్ళాడు. జేబులోని సీసాను తీసి కళ్ళు మూసుకుని గుటగుటా తాగేశాడు. ఖాళీ సీసాను రొంపిలో చెక్కుకున్నాక తమ వాళ్ళ కేసి మిర్రిమిర్రీ చూశాడు.

పలకలు వాయిస్తున్న వాళ్ళ చొక్కాలు బొత్తాలూడిపోయి, గాలిలో యెగురుతున్నాయి. యెండకు కరిగిన తార్రోడ్డు పైన వాళ్ళ పాదాల ముద్రలు స్పష్టంగా పడుతున్నాయి. తన చేతిలోని సంచిని రోడ్డు పక్కన వుంచేశాక, నర్సింహులు గంగయ్యకేసి చూసి, అదోలానవ్వి, చేతులు పైకెత్తి కాళ్ళు జాడించి రెండడుగులు వేశాడు. గంగయ్య అతడికేసి కోపంగా చూడబోయి, అంతలో సిగ్గు పడిపోయి, మరునిముషంలో పరవశంగా నవ్వేసి, వుద్వేగంతో ముందుకు దూకాడు. అతడి రొంపిలోని సీసాలు రెండూ రోడ్డుపైన పడి బాంబుల్లా పగిలాయి. యెగురుతున్న వాళ్ళంతా వులిక్కిపడి తిరిగిచూశారు. అదేమీ పట్టించుకోకుండా అడుగేస్తున్న గంగయ్య కనబడగానే వాళ్ళు గొల్లున నవ్వుతూ శక్తి కొద్దీ పైకెగిరి దూకారు.

మోటరు సైకిలు తుమ్మలగుంట వైపుకు పరిగెడుతోంది. యెస్సీ నగర్ మనుషులు రోడ్డుపైన పడమటివైపుకు నడుస్తున్నారు.

శ్మశానానికెదురుగా, కాలి కరిగిపోతున్న తార్రోడ్డుపైన, పలకలరొదా, మాలవాళ్ళ వున్మాదపు చిందూ సాగిపోతూనే వున్నాయి.

**(12 మార్చి2008, నవ్య వారపత్రిక)**